క్లుప్తంగా

నేలకూలిన కొబ్బరి చెట్టు, విద్యుత్ స్తంభం



నారాయణపేటలో వర్షాలకు నేలకూలిన కొబ్బరి చెట్టు, విద్యుత్ స్తంభం

అమలాపురం టౌన్: పట్టణంలోని నారాయణపేట శివారు ప్రభాకర్ నగర్‌లో మంగళవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి, వీచిన గాలులకు ఓ కొబ్బరి చెట్టు, విద్యుత్ స్తంభం నేలకూలాయి. కొబ్బరి చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో స్తంభం నేలకూలింది. విద్యుత్ స్తంభం ఓ ఇంటి ముందు ఉనర్న కారుపై పడింది. దీంతో ఆ కారు పాక్షికంగా దెబ్బతింది. కొబ్బరి చెట్టు, విద్యుత్ స్తంభం రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కల్గింది. విద్యుత్ సరఫరా సైతం నిలిచిపోయింది. మధ్యాహ్నం 12 గంటల కల్లా నేల కూలిన కొబ్బరి చెట్టును తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. విద్యుత్ శాఖ సిబ్బంది హుటాహుటీన పడిన విద్యుత్ స్తంభం, విద్యుత్ తీగలను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అనాథ పిల్లలకు ఆహారం దుస్తుల దానం

అమలాపురం టౌన్: వాకర్స్ క్లబ్ డైరెక్టర్లు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కామాక్షీ పీఠంలోని ప్రేమ మందిరంలో పెరుగుతున్న అనాథ పిల్లలకు ఆహారం, దుస్తులను దానం చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. తమ తల్లి యర్రమిల్లి సరస్వతి 40వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకార్థం ఆమె కుమారులైన యర్రమిల్లి సోదరులు ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు.

అప్పారావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు

అమలాపురం టౌన్: పట్టణం పేరమ్మ అగ్రహారానికి చెందిన ఉపాధ్యాయుడు ఏవీ అప్పారావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్–2025 అవార్డు లభించింది. స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, రాజకీయ నాయకుల జీవిత చరిత్రలు తెలిపే 75 వేల కర పత్రాలను విద్యార్థులకు పంపిణీ చేసి వారిలో దేశభక్తిని నింపిన సేవలకు ఈ అవార్డు వరించింది. ప్రస్తుతం అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెం గున్నపంతులు అగ్రహారం యూపీ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా అప్పారావు పని చేస్తున్నారు. అమలాపురం పట్టణంలో తమ 20వ వార్డుకు చెందిన ఉపాధ్యాయుడు అప్పారావు ఈ అవార్డును కై వసం చేసుకోవడం తమ వార్డుకే గర్వకారణమని ఆ వార్డు కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, రాణి ప్రసాద్ దంపతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అప్పారావు దంపతులను పేరమ్మ అగ్రహారంలోని వారి ఇంట్లో కౌన్సిలర్ దంపతులు మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

తాళ్లరేవు: గ్రామాలలో బెల్టుషాపులు దర్జాగా నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని చినవలసల గ్రామానికి చెందిన ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ బొడ్డు రాజేశ్వరి ఆరోపించారు. మంగళవారం ఆమె స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శివారు ప్రాంతాలలో బెల్ట్‌షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నా ఎక్సై జ్ పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా గాడిమొగ పంచాయతీ పరిధిలోని చినబొడ్డు, పెదబొడ్డు వెంకటాయపాలెం, గాడిమొగ, పెదవలసల గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారన్నారు. యానాం నుంచి అక్రమ మద్యం, కల్తీ మద్యం కూడా విక్రయిస్తున్నారని గత మే 20వ తేదీన ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోగా ఎక్సై జ్ సీఐ, ఎస్సైలు మహిళనైన తనను అవమానించారని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా శాఖ అధ్యక్షుడు వెంకట్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వెంకట్ మాట్లాడారు. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతపై సమావేశం చర్చించింది. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత అమలాపురం జిల్లా కేంద్రం అయ్యాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవసరం మరింత పెరిగిందని పేర్కొన్నారు. అమలాపురంలో ప్రభుత్వ పరంగా డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల పేద విద్యార్థులు వేలకు వేలు ఫీజుల చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయకుంటే ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిరామ్, సతీష్, సందీప్, నూకన్న, ప్రసాద్, సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికే కీలకం

- ఖరీఫ్ సాగుకు 'స్వర్ణ' అనుకూలం
- రైతు సేవా కేంద్రాల్లో విక్రయానికి సిద్ధం



ముమ్మిడివరంలో నారుమడి సిద్ధం చేసుకుంటున్న రైతు

ముమ్మిడివరం: విత్తు కోసం పంట అనేది నానుడి అయితే మంచి విత్తనం ఎంపిక చేసుకోవడం ద్వారానే అధిక దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తనం వరి రకాలు ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు వహించాల్సి ఉంటుందంటున్నారు. ముమ్మిడివరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 30వేల ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నారు. నూరు శాతం కాలువల ద్వారా ప్రవహించే నీటి తోనే సాగు జరుగుతుంది. ఖరీఫ్‌లో ముఖ్యంగా స్వర్ణ, ఎంటీయూ 7029, 1318 వంటి రకాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ముంపు ప్రభావం ఉండే ప్రాంతాలలో స్వర్ణ, 1318 రకం వరి సాగు అనుకూలంగా ఉంటుంది. వివిధ రకాల భూములు, వాతావరణ పరిస్థితులను తట్టుకుని రెండు పంటలు పండించుకొనే ప్రాంతాల్లో మంచి దిగుబడి ఇచ్చే వరి రకం స్వర్ణ. ఇది తక్కువ నత్రజనితో అధిక దిగుబడిని ఇస్తోంది. పంట చేతికొచ్చే సమయంలో చేలల్లో గింజ మొతకెత్తే స్వభావం తక్కువగా ఉంటుంది. చౌడు భూములలో సాగుకు ఇది అనుకూలంగా ఉంటుంది. 160 రోజులలో పంట చేతికొస్తుంది. వర్షాధారం ఆరుదల పంటకు అనువుగా ఉండే ఎంటీయూ 1318 రకం వరిని సాగు చేసుకోవచ్చు. ముమ్మిడివరం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. ముమ్మిడివరం మండలంలో ఎంటీయూ 1318 రకం సంపద స్వర్ణ, కనక ప్లస్ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్ తెలిపారు.

ఎస్. ప్రశాంతకుమార్

విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గుర్తింపు పొందిన సంస్థలు సర్టిఫైడ్ చేసిన విత్తనాలనే కొనుగోలు చేయాలి
- దళారుల ప్రోద్బలంతో విడి విత్తనాలు కొనుగోలు చేయడం మంచిదికాదు
- వ్యవసాయ శాఖతో అనుమతి పొందిన డీలరు వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. లేదంటే ఇబ్బందులు వస్తే ప్రశ్నించలేము.
- విత్తన మొలక శాతం పరీక్షించిన తరువాతే కొనుగోలు చేయాలి
- విత్తనాల సంచితోపాటు లాట్‌నంబర్, కాల పరిమితి తప్పనిసరిగా సరి చూసుకోవాలి. విత్తన సంచిని , ట్యాగ్‌ను, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్ర పర్చుకోవాలి.
- నాణ్యమైన విత్తనం ద్వారా మంచి దిగుబడులు
- మంచి విత్తనాలు ఎంపిక చేసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు
- విత్తనాలు మొలక శాతాన్ని పరీక్షించి నారుమడులు వేయాలి. రైతు భరోసా కేంద్రాలో విత్తనాలు కొనుగోలు చేయాలి. విధిగా డీలరు ఇచ్చే బిల్లులను రైతులు జాగ్రతగా భద్రపర్చుకోవాలి.
- ఖరీఫ్ సీజన్‌లో స్వర్ణ రకం వరి సాగు అనుకూలంగా ఉంటుంది.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు నాయకులు వుంగరాల సంతోష్, గంటా దిలీప్ ఉన్నారు.
– తాళ్లరేవు

అదుపు తప్పి పక్కకు ఒరిగిన స్కూల్ బస్సు

ముమ్మిడివరం: పల్లవారిపాలెం మీదుగా వెళుతున్న ఓ పాఠశాల వ్యాన్ మంగళవారం అదుపు తప్పి ఒక పక్కకు ఒరిగింది. వ్యాన్‌లో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. అయితే వారంతా సురక్షితంగా బయట పడడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్కూల్ బస్సుల రాకపోకల్లో యజమామరింత జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్తమ సేవలకు మంచి గుర్తింపు

- డీఈవో షేక్ సలీం బాషా



శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న డీఈవో సలీం బాషా, ఏపీసీ మమ్మీ తదితరులు

అమలాపురం రూరల్: వృత్తిపై అంకితభావంతో ఉత్తమ సేవలందిస్తే గుర్తింపు దానికదే వస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ పేర్కొన్నారు. పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేసిన కడలి ఆనంద రామ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన సత్కార సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి, నిబద్ధతో అందించిన సేవలు కలకాలం విద్యార్థులు, తల్లిదండ్రుల మనస్సుల్లో నిలుస్తాయన్నారు. స్ఫూర్తిదాయకమైన సేవలందించిన శ్రీనివాసరావును సర్పంచ్ దాసరి అరుణాడేవిడ్, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, డీవైఈవో జి.సూర్యప్రకాశరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు, సమగ్రశిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పీ.రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ప్రశంసించారు. శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పట్టణంలో వృద్ధులకు పింఛను అందజేస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలోని 25వ వార్డులో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. వార్డులోని కొంత మంది వృద్ధులకు, దివ్యాంగులకు ఆయనే స్వయంగా అందజేశారు. అనంతరం వార్డుల్లో పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. పెన్షన్ల పంపిణీ తీరును స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాయినాథ్ జయచంద్ర గాంధీ, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ పాల్గొన్నారు.

నేత్రదానం



సీతారాం

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీకి చెందిన ధూళిపూడి సీతారాం(60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త వీరభద్రరావు, కుటుంబ సభ్యులు రాంజీ, అంజలిల అంగీకారం మేరకు ఆమె నేత్రాలను ఐ బ్యాంకుకు దానం చేసినట్టు సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.సత్యనారాయణ, సాయిరాం, వెంకట్రావు, భీమేష్, భద్ర తదితరులు ఉన్నారు.

టిడ్కో గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న సూర్యనారాయణమూర్తి, నాయకులు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన లబ్ధిదారులకు అల్లవరం మండలం బోడసకుర్రులో నిర్మించి ఇచ్చిన టిడ్కో గృహ సముదాయంలో కనీస వసతులు లేక గ్రహస్తులు అవస్థలు పడుతున్నారని పట్టణానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో గృహాల అసౌకర్యాలతో పాటు పట్టణంలోని నెలకొన్న పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో సూర్యనారాయణమూర్తి, ఆ పార్టీ నాయకుల మంగళవారం స్వయంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. టిడ్కో గృహ సముదాయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దోమల బెడద ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశార. రోడ్లపై విచ్చల విడిగా సంచరించే పశువులను అదుపు చేయాలని కోరారు. పార్టీ నాయకులు పితాని బేబీరావు, సాదనాల రామకృష్ణ, గానుగుల సత్యనారాయణ, కేతా సోమేశ్వరరావు, యాలంగి రామకృష్ణ తదితరులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముమ్మిడివరం: జాతీయ డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కొత్తలంక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ముకుంద ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ జ్వరం లక్షణాలు, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీహెచ్ ఎన్.విమలకుమారి, హెచ్‌వీ శాంతకుమారి, స్టాఫ్‌నర్స్ వనిత, పి.సుశీల, ఎస్.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ నార్ని శ్రీనివాస్, జె.సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

- కోనసీమ రవాణా జేఏసీతో ఎంపీ హరీష్ మాధుర్



కోనసీమ రవాణా జేఏసీ బృందంతో మాట్లాడుతున్న ఎంపీ హరీష్ మాధుర్

అమలాపురం టౌన్: మోటారు వాహనాల ఫిట్‌నెస్ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానంలో వాహనదారులకు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు కోనసీమ రవాణా జేఏసీ ప్రతినిధుల బృందం తెలిపింది. అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీని రవాణా జేఏసీ బృందం మంగళవారం కలిసి తమ సమస్యలను వివరించారు. ఆ నూతన విధానంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీకి రవాణా జేఏసీ బృందం వినతిపత్రం అందజేసింది. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కాకుండా గతంలో మదిరిగా రవాణా శాఖ, వాహన యాజమానుల ద్వారా సర్టిఫికెట్ల ప్రక్రియ కొనసాగించాలని వారు ఎంపీని కోరారు. కోనసీమ వాహన యాజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి మీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హరీష్ మాధుర్ కోనసీమ రవాణా జేఏసీ ప్రతినిధుల బృందానికి స్పష్టం చేశారు.

నేటి వంతెనపై నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు

సాక్షి ఇంపాక్ట్

అమలాపురం టౌన్: పట్టణంలో ఈదరపల్లి కొత్త వంతెన నిర్మాణం పేరుతో పక్కనే ఉన్న పాత వంతెనపై దాదాపు 50 రోజులుగా నిలిపేసిన ఆర్టీసీ బస్సుల రాకపోకలను బుధవారం పునరుద్ధరించనున్నారు. కొత్త వంతెన నిర్మాణం కారణంగా పాత వంతెనపై రాకపోకలను నిలిపేస్తూ ట్రాఫిక్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. కొత్త వంతెన శ్లాబ్ పూర్తయిన పది రోజుల కిందట పాత వంతెనపై నుంచి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను అనుమతించారు. అయితే ఆర్టీసీ బస్సులను అనుమతించకపోవడంతో ట్రాఫిక్ ఆంక్షల్లో భాగంగా చుట్టు తిరిగి బోడసుకుర్రు వంతెన వరకూ వెళ్లి అక్కడ నుంచి తోట్ల పాలెం మీదుగా అంబాజీపేట, రావులపాలెం తదితర సుదూర ప్రాంతాలకు బస్సులు వెళ్లేవి. ఈ బస్సుల ప్రయాణం వల్ల ప్రయాణికులు అదనపు టిక్కెట్ చార్జీలతో పాటు సమయం కూడా ఎక్కవ పట్టేది. ఈ అసౌకర్యంపై 'సాక్షి'లో మూడు రోజుల కిందట ప్రచురితమైన 'ఎన్నాళ్లీ అదనపు భారం' కథనానికి అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సులను పాత వంతెనపై నుంచి రాకపోకలను పునరుద్ధరించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ సత్యనారాయణ, ఆర్ అండ్‌బీ ఏఈ తోట రమేష్ మంగళవారం సంయుక్తంగా చర్చించుకుని ఆర్టీసీ బస్సులకు వెసులబాటు కల్పించారు.

నాయుడు సేవలు అభినందనీయం



ఉద్యోగ విరమణ పొందిన రామస్వామి నాయుడు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన అరవ రామస్వామి నాయుడు సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు ప్రస్తావించారు. అరవ రామస్వామి నాయుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా భీమనపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. రామస్వామి నాయుడు శ్రీనివాసమ్మ దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలుతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గుర్లింక చిన్న, ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులాపల్లి శేషవేణి, ఉపాధ్యాయులు కామన మధుసూదనరావు, కె.ప్రసాద్, అనురాధ, అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టీబీ ముక్త భారత్‌కు కట్టుబడి ఉందాం



జాతీయ డెంగీ మాసోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఐ.పోలవరం: టీబీ ముక్త భారత్‌కు కట్టుబడి ఉందామని మురమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. టీబీ ముక్త భారత్ అభియాన్, జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా కొత్త మురమళ్లలో వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. టీబీ, డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దగ్గుతో బాధ పడేవారికి ఇరవై మందికి కళ్లే పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్యాధికారులు రోగులకు వివరించారు. వర్షపు నీరు నిలువ ఉండటం వలన అనేక రకాలైన బ్యాక్టీరియా వృద్ధి చెంది తాగునీరు కలుషితమవుతోందని, దీని వలన దోమలు వృద్ధి చెందుతాయన్నారు. మలేరియా, డెంగీ, చికెన్‌గునియా, ఫైలేరియా మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వర్షాకాలంలో ఎక్కువగా వైరల్ ఫీవర్స్, జలుబు, దగ్గు మొదలైన వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి భరతలక్ష్మి, కేశనకుర్రు పీహెచ్‌సీ అధికారి డాక్టర్ ఎం.ఎస్.రాజేష్‌బాబు, ఎంపీహెచ్‌వో ఎం.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్ వైజర్లు కె.రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం



ఇందుపల్లి ఎ-కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో ఏర్పాట్లును పరిశీలిస్తున్న శ్రీకాంత్, పార్టీ నాయకులు

- ఏర్పాట్లను పరిశీలించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: ×బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇందుపల్లి ఏ-కన్వెన్షన్ హాలును బుధవారం సాయంత్రం నిర్వహించే సమావేశానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావుతో పాటు నాయకులు మంగళవారం పరిశీలించింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జిల్లా స్థాయి పార్టీ సమావేశానికి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు విధిగా హాజరై విజయవంతం చేయాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, సెంట్రల్ డెల్టా బోర్డు మాజీ చైర్మన్ కుడుపూడి బాబు, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచులు చెల్లుబోయిన నాని, దాసరి అరుణ డెవిడ్, నాయకులు బొల్లంగి సుబ్బారాం, గోవ్వాల రాజేష్, గోపిరాజి రమేష్, కేతా భానుతేజ, దొంగ చిన్న తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా

- అమలాపురం ప్రభుత్వ బాలికల పాఠశాల తనిఖీ



పాఠశాలలో భోజనంపై విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా సివిల్ సప్లై మేనేజర్ పి.శ్రీనివాసరావు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం జరుగుతున్న తీరును పరిశీలించారు. భోజనంలో వంటకాలు రుచికరంగా, పరిశుభ్రంగా ఉన్నాయా? అని తీరా తీశారు. భోజనం నాణ్యతపై పథకంలో వంట తయారీ వారిని ప్రశ్నలు వేశారు. భోజనం ఎలా ఉందని భోజనం తిన్న విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనం తయారీకి సంబంధించిన స్టాక్ బియ్యం రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రతి నెలా పాఠశాలకు తమ శాఖ నుంచి బియ్యం సరఫరా అవుతుంది కాబట్టి బియ్యం నిల్వలు ఉండకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆ పథకం ఇంప్లిమెంట్ ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. ఈ నెలాకానెల సరఫరా అయ్యే తాజా బియ్యంతోనే విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్, కాంప్లెక్స్ సీఆర్పీ ఎం.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం



ఆర్‌ఎంపీలను సత్కరిస్తున్న పండితులు, ఆలయ సిబ్బంది



డాక్టర్లు రామమూర్తి, రామంలను సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వైద్యులు దేవుళ్లతో సమానమన్న నినాదంతో అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి అగ్రహారంలో అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. వైద్య రంగానికి, సమాజానికి వైద్య పితామహుడు బీసీ రాయ్ చేసిన సేవలను వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర గుర్తు చేసి కొనియాడారు. అమలాపురం పట్టణంలో దాదాపు 35 ఏళ్లుగా వైద్యులుగా పనిచేస్తూ సేవలు అందిస్తున్న డాక్టర్ నిమ్మకాయల రామమూర్తి, డాక్టర్ గంధం రామంలను వాకర్స్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన డాక్టర్స్ దినోత్సవ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు గోటేటి గంగాధరరావు, బులిటన్ ఎడిటర్ పుత్సా కృష్ణ కామేశ్వర్, వాకర్స్ ప్రతినిధులు పాల్గొని డాక్టర్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఐ.పోలవరం: అత్యవసర పరిస్థితుల్లో ఆలయం వద్ద భక్తులకు ప్రథమ చికిత్స అందించి నిత్యం ఆలయం వద్ద అందుబాటులో ఉండే ఆర్‌ఎంపీ వైద్యులను జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఘనంగా సత్కరించారు. వీరేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఎస్.ఏడుకొండలు, వీరబాబు ఇద్దరు సమయానికి ప్రథమ చికిత్స అందించి వారిని సాయం అందిస్తున్నారు. వీరిని పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరాజు, అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు తోపాటు పలువురు అభినందించి సత్కరించారు.

అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

అమలాపురం రూరల్: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ పీఎస్ శర్మ, డాక్టర్ రుద్రరాజు శిల్ప, చార్టర్ అకౌంటెంట్స్ మంతా సత్యనారాయణ, గోకవరపు వరప్రసాద్, జి కామేశ్వరరావులను సత్కారం చేశారు. బండారులంక సీహెచ్‌ఓలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో వైద్యులు గౌతమి, ఈట అమృత, అన్నామని లను నూతన దుస్తులు శాలువ, పండ్లు అందించి ఘనంగా సత్కరించారు.

ఇరిగేషన్ కల్వర్టుపై ఆక్రమణల తొలగింపు

తాళ్లరేవు: కోరంగ పంచాయతీ సీతారామపురం గ్రామంలో ఇరిగేషన్ కల్వర్టుపై ఉన్న పలు ఆక్రమణలను మంగళవారం అధికారులు తొలగించారు. తాళ్లరేవు బైపాస్ రహదారి నుంచి గాడిమొగ వెళ్లే రహదారిలో ఉన్న కోరంగి కాలువపై ఉన్న కల్వర్టును ఆక్రమించుకుని పలువురు వ్యాపారాలు సాగిస్తున్నారు. చికెన్ షాపుతోపాటు ఆక్వా షాపును నిర్వహించడంతోపాటు వాటికి సంబంధించిన వ్యర్థాలను పంట కాలువలో వేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కోరంగ పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ ఆక్రమణదారులకు నిర్ణీత గడువులోగా ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. అయితే వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించకపోవడంతో కోరంగ ఎస్సై పి.సత్యన్నారాయణ, తాళ్లరేవు, పి.మల్లవరం పంచాయతీ కార్యదర్శులు నున్న శంకరనారాయణ, సూరంపూడి వెంకటరమణ, వీఆర్వోలు, మహిళా పోలీసులు, పంచాయతీ సిబ్బంది సమక్షంలో ఆయా దుకాణాలను పొక్లెయిన్‌తో తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవని రమణ హెచ్చరించారు.